www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 డిసెంబరు 2022
5
ఏలూరు

వణికిస్తున్న మాండూస్ 6లో..

భీమడోలులో వర్షానికి తడుస్తున్న ధాన్యం రాసులు

గ్రామస్థాయిలో పోరు విస్తృతం

ముగిసిన ఎపి వ్యకాస 29వ రాష్ట్ర మహాసభ
ఉత్తేజాన్నిచ్చిన ప్రదర్శన, బహిరంగ సభ
ప్రతినిధుల సభలో విస్తృత చర్చలు, సమీక్షలు
జాతీయ, రాష్ట్ర నేతల దిశానిర్దేశంతో నూతనోత్సాహం
22 తీర్మానాలు ఆమోదం : నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

మహాసభలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

గ్రామస్థాయిలో కూలిపేటల్లో పేదలను సంఘటితం చేసి ఐక్య పోరాటాలు విస్తృతం చేయాలనే నినాదాల నడుమ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో ముగిసింది. జంగారెడ్డిగూడెం శివార్లలో దండమూడి రామలక్ష్మి కళ్యాణ మండపంలో మూడు రోజులపాటు ఈ మహాసభ జరిగింది. తొలిరోజు గురువారం స్థానిక మార్కెట్ యార్డు నుంచి బస్టాండ్ వరకూ సాగిన ప్రదర్శన పట్టణవాసులను ఆకట్టుకుంది. అనంతరం జరిగిన బహిరంగ సభలో వేలాది మంది పేదలు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు గిరిజనోద్యమ జాతీయ నేత బృందాకరత్, వ్యకాస జాతీయ అధ్యక్షుడు విజయ రాఘవన్ సందేశాలు పేదలు, సంఘం నేతల్లో ఉత్తేజాన్ని నింపాయి. రెండో రోజు సంఘం సీనియర్ నేత పాటూరు రామయ్యచే సంఘ పతాకావిష్కరణతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ప్రారంభ సభలో సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ ప్రసంగం ప్రతినిధులకు దిశానిర్దేశం చేస్తూ సాగింది. ఈ సభలోనే పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెడుతూ రాష్ట్రంలో గత మూడేళ్లలో చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు మహాసభ ముందుంచారు. అలాగే వ్యవసాయ కార్మికులు ఈ కాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ సంఘం తరపున చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను వివరించారు. దీనిపై 26 జిల్లాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు చర్చించి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే వ్యవసాయ కార్మికులతోపాటు పేదలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 22 తీర్మానాలను మహాసభలో విస్తృతంగా చర్చించి ఆమోదించారు. కేరళ వ్యవసాయ కార్మికుల సంక్షేమ బోర్డు చంద్రన్ ఆ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, పోరాటాలు వివరించారు. అక్కడ వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు అమలు చేస్తున్న పథకాలు, తోడ్పాటు గురించి వివరించారు. మహాసభ జరిగిన తీరుపై ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామాల్లో పేటలవారీ సంఘాన్ని బలోపేతం చేసి పోరాటాలు ఉధృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. తోటి సంఘం బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు జె.విల్సన్‌తోపాటు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రు మాల్యాద్రి, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామన్న, రైతుసంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యకాస సీనియర్ నేత పి.సోమయ్య, మంతెన సీతారాం సౌహార్ధ సందేశాలిచ్చారు. ఆహ్వాన సంఘం తరపున గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య, డాక్టర్ కె.వజ్ర కిరణ్, ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.రవి, వ్యకాస జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జీవరత్నం, పివి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా దడాల సుబ్బారావు, జి.ఈశ్వరమ్మ, ఎ.రవి, కె.నారాయణ, ఎం.పుల్లయ్య వ్యవహరించారు. చివరి రోజు శనివారం సాయంత్రం నూతన కమిటీ 79 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏలూరు జిల్లా నుంచి ఎ.రవి, తామా ముత్యాలమ్మ, పశ్చిమగోదావరి జిల్లా నుంచి జక్కంశెట్టి సత్యనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏలూరు జిల్లా నుంచి ఎం.జీవరత్నం, పిల్లి రామకృష్ణ, తుమ్మల సత్యనారాయణ, శేషపు మహంకాళిరావు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి బాతిరెడ్డి జార్జి, బల్ల చినవీరభద్రం, కండెల్లి సోమరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాల్లో వ్యకాస జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జీవరత్నం, పివి.రామకృష్ణ, సిఐటియు నేతలు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, గిరిజన సంఘం నేతలు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, స్థానిక నేతలు సుభాని, వంగా గోపీ, పి.సూర్యారావు, గుడెల్లి వెంకట్రావు, ఎ.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పోరాటాలు చేయాలి

వి.కృష్ణయ్య, ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు వ్యవసాయ కార్మికులు, రైతులు భుజంభుజం కలిపి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కష్ణయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ప్రభుత్వమని చెబుతున్నప్పటికీ గతం కన్నా 10 శాతం ఆత్మహత్యలు పెరిగాయన్నారు. చిన్న రైతులు వ్యవసాయం చేయలేని విధంగా పరిస్థితులు మారాయన్నారు. దేశవ్యాప్తంగా కనీస మద్దతు ధర అనే అంశం ముందుకు వస్తుందని తెలిపారు. ఇది రానున్న రోజుల్లో మహా ఉద్యమంగా మారుతుందని అన్నారు. 13 నెలలు రైతులు పోరాడి చారిత్రాత్మకంగా మోడీ మెడలు వంచి విజయం సాధించారన్నారు.

భూ పంపిణీ జరిగే వరకు పోరు

ఆహ్వాన సంఘం కార్యదర్శి ఎ.రవి

రాష్ట్రంలో పేదలకు భూ పంపిణీ జరిగే వరకు పోరాడాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం దండమూడి రామలక్ష్మి కళ్యాణ మండపంలో మహాసభ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి పంచాలి కూలి పెంచాలి, వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమం ప్రతి గ్రామంలో విస్తరించాలని అన్నారు.

నిరుద్యోగ కార్మిక సమస్యలపై పోరాటానికి సిద్ధం

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఉపాధి కోల్పోతున్న నిరుద్యోగ కార్మిక సమస్యపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి నట్టేట ముంచారని విమర్శించారు. ఈ సమస్యపై యువతను చైతన్యపరిచి కార్మిక శక్తితో ఐక్య ఉద్యమాలకు సన్నద్ధమవుతామని తెలిపారు.

బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దాం

డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల ఫలితంగా కార్మికుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయయాంత్రికరణ పెరుగుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. గ్రామీణ సేవకులను ఐక్యం చేసేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మిద్దామని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం యాజమాన్యానికి ఊడిగం చేసేలా కార్మికుల హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఐక్య పోరాటాలు నిర్మించాలన్నారు.

పోరాటమే నినాదం

డాక్టర్ వజ్ర కిరణ్, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు

కార్మికులందరికీ పోరాటమే నినాదం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ వజ్రకిరణ్ అన్నారు. శనివారం మహాసభ ముగింపు కార్యక్రమంలో డాక్టర్ వజ్ర కిరణ్‌ను నేతలు శాలువాతో సత్కరించారు. అనంతరం వజ్రకిరణ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమన్నారు. కార్మికులు ఐక్యంగా హక్కుల కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్మిక సమస్యలపై నిర్వహించే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

ధాన్యం బస్తాల ట్రాక్టర్‌ను రోడ్డుపై అడ్డంగా పెట్టి రాస్తారోకో చేస్తున్న కౌలురైతులు

ధాన్యం కొనుగోలుకు ముప్పతిప్పలు

తేమశాతం పేరుతో ధాన్యం తిరస్కరణ
బతిమిలాడినా కనికరించని రైస్ మిల్లర్
ముదినేపల్లిలో పరిస్థితి దారుణం
చేసేది లేక రోడెక్కిన కౌలురైతులు
రహదారిపై రాస్తారోకో
నిలిచిన ట్రాఫిక్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఓ వైపు మాండూస్ తుపాను హెచ్చరికలు.. మరోవైపు చుట్టూ కారుమబ్బులు.. ఈ క్రమంలో మాసూళ్ల పూర్తయ్యి ధాన్యం అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్తున్న రైతులకు చేదు అనుభవాలు ఎదరవుతున్నాయి. మిల్లర్లు, ఆర్‌బికె సిబ్బంది రకరకాల కారణాలు చూపుతూ ధాన్యం కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. తేమశాతం పేరుతో ధాన్యం వెనక్కి పంపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఓ రైతుకు సంబంధించిన ధాన్యం తేమశాతం పేరుతో కొనుగోలు చేయబోమంటూ వెనక్కి పంపడంతో ఓ రైతు చేసేది లేక ఆ ధాన్యంతో రోడ్డుపై రాస్తారోకోకు దిగాడు. ముదినేపల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కౌలురైతు దాడే ఆంజనేయులు తన ధాన్యాన్ని ముదినేపల్లిలోని ఆర్‌బికెలో తంతు ముగించుకుని శనివారం పెయ్యేరులోని శ్రీరామా రైస్‌మిల్లుకు ధాన్యం తీసుకెళ్లారు. అక్కడి రైస్‌మిల్ యజమాని ధాన్యాన్ని పరిశీలించి 'ధాన్యంలో రెండు రకాల విత్తనాలుయి. అంతేకాక తేమశాతం అధికంగా ఉంది. మా దగ్గర డ్రై మిషన్ లేదు. అరబెట్టేందుకు స్థలం లేదు. మా గుమస్తాతో ఎక్కడికన్నా రాయించుకో. లేకుంటే మీ ఇంటి దగ్గర అరబెట్టుకో. లేకపోతే కాల్వలో పారేసుకో. మీ ధాన్యం కొని మేము నష్టపోవాలా..?' అంటూ ఆ కౌలురైతుకు దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో ఆంజనేయులు వాతావరణం బాగోలేదని, ధాన్యాన్ని దింపుకోవాలని ఎంత బతిమిలాడినా రైస్‌మిల్లు నిర్వాహకులు ససేమిరా అంటూ ధాన్యం కొనే ప్రసక్తేలేదంటూ భీష్మించాడు. దీంతో కౌలు రైతు రెవెన్యూ, ఆర్‌బికె అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో చేసేదిలేక ధాన్యం ట్రాక్టర్‌ను ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డుపై అడ్డంగా పెట్టి కౌలు రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా కూర్చుని వాహనాల రాకపోకలను అడ్డుకున్నాడు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదే రోడ్డులో సింగరాయపాలెంలో షష్టి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. అదేసమయంలో రోడ్డుపై రాస్తారోకో రైతులు చేపట్టడంతో భారీగా వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ కె.వెంకటేశ్వరావు సంఘటన స్థలానికి చెరుకుని రైతుల నుంచి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ రైస్ మిల్లు నిర్వాహకునితో, రైతులతో చర్చించారు. అనంతరం తహశీల్దార్ రైస్‌మిల్ యజమానితో ఫోన్‌లో మాట్లాడడంతో ఎట్టకేలకు రైస్‌మిల్లు నిర్వాహకుడు ధాన్యం తీసుకునేందుకు అంగీకరించాడు. ఎస్ఐ షణ్ముఖసాయి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం రైతులతో, రైస్‌మిల్లు యాజమానితో చర్చించారు.

రైస్‌మిల్లర్లు నిలువునా దోచేస్తున్నారు : రైతులు

రైస్ మిల్లర్లు తమను నిలువునా దోచుకుంటున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఒకపక్క ప్రభుత్వం కొత్త విధానంతో రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతుండగా మరోపక్క రైస్‌మిల్లర్లు తేమశాతం పేరుతో రైతులను నిలువు దోపిడి చేస్తున్నారన్నారు. తేమశాతం 17కు పైగా ఉందంటూ ఎక్కువ ఉన్నా తేమ శాతానికి డబ్బులు ముందస్తు కడితేనే ధాన్యం కొనుగోలు చేస్తామంటూ రైతులను ఇబ్బందులను పెడుతూ దోచుకుంటున్నారని రైతు గండేపూడి నాగేశ్వరరావు అన్నారు. ఆర్‌బికెలో 19 తేమ శాతం వస్తే, రైస్‌మిల్లు దగ్గర 24 తేమ శాతం ఉందంటూ రైస్‌మిల్లు నిర్వాహకులు చెబుతున్నారన్నారు. తేమ శాతం రేటు కడితే తమ ధాన్యం తీసుకుంటూమని లేకుంటే ఇంటికి తీసుకుపోవాలంటూ చెబుతున్నారని వాపోయాడు. తన ధాన్యం తేమ శాతానికి రూ.10,600 కట్టాలని చెప్పడంతో, ఆ మొత్తం కట్టానని, కానీ డబ్బు కట్టినట్లు తనకు రశీదు కూడా ఇవ్వలేదని వాపోయాడు. అదేవిధంగా మండవల్లి మండలం కానుకొల్లుకు చెందిన మరడాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం 11 రోజులు అరబెట్టానని, ఆర్‌బికెలో 15 తేమ శాతం వచ్చినట్లు చెప్పాడు. ఆర్‌బికె నుంచి ముదినేపల్లి శ్రీరామా రైస్‌మిల్లుకు తీసుకువస్తే తేమ శాతం 21 ఉన్నట్లు రైస్‌మిల్లు నిర్వాహకులు చెబుతున్నారని, చేసేదిలేక వారు చెప్పిన విధంగా రూ.5100 చెల్లించి, ధాన్యం మిల్లు వద్ద దింపినట్లు వివరించాడు. ఈ విధంగా అడ్డగోలుగా రైతుల నుంచి తేమ శాతం అధికంగా ఉందంటూ రైస్‌మిల్లర్లు రైతులను దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని ముఖ్తకంఠంతో కోరుతున్నారు.

తేమశాతం నిబంధనలు సడలించాలి

ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి - దెందులూరు

ఆందోళన చేస్తున్న నాయకులు

ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని, తుపాను ప్రభావంతో తడిసిన ధాన్యాన్ని తేమశాతం నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం దెందులూరు మండలంలోని కొవ్వలిలో ఎపి రైతు సంఘం నాయకులు పర్యటించి మాండూస్ ప్రభావంతో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం రాసులను పరిశీలించారు. కల్లాల్లోని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, దళారీ వ్యవస్థను నిర్మూలిస్తామని పెద్దఎత్తున ప్రచారం చేసి ప్రస్తుతం కొనుగోలు లక్ష్యం మేరకే రైతుల నుండి ధాన్యం సేకరిస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. రైతులు పండించిన ధాన్యం ఎక్కడికక్కడ కల్లాల్లో ఉండిపోయిందని చెప్పారు. గోనె సంచులు అందుబాటులో లేక, సంచులున్నా ధాన్యం రవాణాకు లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణలో నూతన విధానం రైతులకు మేలు చేస్తుందని చెప్పి ఆచరణలో అన్నదాతలను కష్టాలకు గురి చేస్తున్నారని విమర్శించారు. రైతుల నుండి పూర్తిగా ధాన్యం సేకరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన విజయవాడలోని సివిల్ సప్లయిస్ కార్యాలయం వద్ద రాయబార కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు వల్ల రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రైతుల ఆత్మహత్యల్లో మనరాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తేమ శాత నిబంధనలు సడలించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలన్నారు. ధాన్యం రవాణాకు లారీల కొరత నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండి రాజా, సున్నా వెంకటరావు, రైతులు, కౌలు రైతులు కె.సురేష్, జి.వినయ్, బి.బుజ్జి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నమ్మకం.. వరిసాగుపై ఇష్టం.. లేదా..!

సాగునీటి సలహా మండలి సమావేశానికి ఎంఎల్‌ఎల డుమ్మాపై సర్వత్రా చర్చ - వరిసాగు అంటేనే 'వర్రీ' అన్పిస్తున్న ప్రభుత్వ విధానాలు

గోదావరి జిల్లాలంటే వ్యవసాయ సాగుకు చిరునామా అని చెప్పొచ్చు. అందులో పశ్చిమగోదావరి జిల్లా అంటే ధాన్యాగారంగా పేరొందింది. అటువంటి జిల్లాలో దాళ్వా సాగుకు సంబంధించి చర్చించేందుకు ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించే సాగునీటి సలహా మండలి సమావేశానికి ఆ జిల్లా పరిధిలోని ఒక మంత్రి మినహా మిగిలిన ఎంఎల్‌ఎలంతా డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. ప్రధానంగా ఈ సమావేశంలో తాము ప్రస్తావించే అంశాలను ప్రభుత్వం పట్టించుకోదనే భావనే కారణమా.. లేక వరిసాగుపై సదరు ప్రజాప్రతినిధులకు ఇష్టం లేదా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

సాగునీటి సలహా మండలి సమావేశంలో గోదావరి నుంచి దాళ్వా సాగుకు అందుబాటులో ఉండే నీరెంత, పూర్తి ఆయకట్టుకు నీరందించగలమా, కాల్వలు ఎప్పుడు మూసేయాలి, మళ్లీ ఎప్పుడు తెరవాలి.. సకాలంలో దాళ్వా సాగుకు ఏం చర్యలు తీసుకోవాలి.. కాల్వలు మూసివేసినప్పుడు చేపట్టాల్సిన ఆధునికీకరణ పనులు తదితర అంశాలపై విస్తృత చర్చ ఈ సమావేశంలో జరగడం సర్వసాధారణం. అయితే దానికి భిన్నంగా గోదావరిలో నీటి లభ్యత పుష్కలంగా ఉన్నందున దాళ్వా సాగుకు ఇబ్బంది లేదని ఏకవాక్యంలో తేల్చేశారు. ఇక కాల్వల మూసివేత, మళ్లీ నీటి విడుదల తేదీల నిర్ణయం, ఆధునికీకరణ పనులపైనా మమ అన్పించేశారు. ఈ సమావేశానికి డిప్యూటీ సిఎం, రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఒక్కరే హాజరయ్యారు. మరో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుగాని, ఆ జిల్లా పరిధిలో ఉన్న అధికార, ప్రతిపక్ష ఎంఎల్‌ఎలు ఎవరూ హాజరుకాలేదు. దీంతో మంత్రి కొట్టునే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నట్లుగా అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసి సమావేశం ముగించేశారు. 'కొబ్బరికాయలు కొడితే పనులు పూర్తి చేసినట్టా' అంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఎందుకంటే పాలకపక్షం, ఆపై సాక్షాత్తూ మంత్రి వ్యాఖ్యలు ప్రభుత్వ పర్యవేక్షణా లోపాన్ని సూచిస్తున్నాయా.. లేక ఆర్థిక అసమర్థతను కప్పిపుచ్చుకునేలా అధికారులపై నెపం నెట్టడమా అనే అంశాలు తెరపైకి వచ్చాయి. నిధులు పుష్కలంగా ఉండి, చేస్తున్న పనులకు బిల్లులు వెంటనే మంజూరవుతుంటే పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందనేది అందరి ప్రశ్న. ఒకవేళ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపమే కారణమైతే సంబంధిత ఒకరిద్దరు అధికారులపై చర్యలు తీసుకునే, సిఫార్సు చేసే హోదాలోనే మంత్రి కొట్టు ఉన్నారు. అలాకాకుండా నిధుల్లేకుండా, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు ముందుకు సాగకపోతే దానికి బాధ్యులెందుకు అవుతారని అంతా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్భాటపు ప్రసంగాలు.. సమీక్షలు మాని పనులు ముందుకు సాగకపోవడానికి మూలకారణం ఏమిటో తెలుసుకుని చర్యలు తీసుకుంటే అటు ప్రజలకు ఉపయోగం.. ఇటు ప్రభుత్వానికి మచ్చ లేకుండా ఉంటుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

దాళ్వా సాగుపై ప్రజాప్రతినిధుల స్పందన అలా ఉంటే గతంలో కనీస మద్దతు ధర అయినా ఇవ్వండని కోరే రైతులు అయ్యా మా ధాన్యం కొనండయ్యా అని దీనంగా వేడుకునే పరిస్థితికి పాలకులు తీసుకురావడం గమనార్హం. తేమ శాతం పేరిట నిబంధనల అడ్డంకి ఒక అడ్డంకి, అది అధిగమించి ధాన్యం ఆర్‌బికెకు విక్రయించినా గోనె సంచుల కొరత, అదీ అధిగమిస్తే లారీల సమస్య రైతులను వెంటాడుతోంది. మొత్తంగా వరి రైతుకు పంట చేతికొచ్చాక అడుగడుగునా ఆటంకాలు ఎదురుకావడం ఆశనిపాతంలా మారింది. దీంతో రైతులు వరి సాగుకు దూరమయ్యేలా ప్రభుత్వ విధానాలున్నాయని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి రైతాంగ అనుకూల విధానాలు చేపట్టకపోతే ఆహారభద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - చింతలపూడి

ఎయిమ్ అధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎయిమ్ రాష్ట్ర కన్వీనర్ ఎం.రాంబాబు అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 18వ తేదీన స్క్రినింగ్ టెస్ట్ ఐకాన్ సంస్థ ద్వారా నిర్వహించనున్నట్లు, పరీక్షలో ఉత్తీర్ణత అయినవారికి ఉచిత కోచింగ్, మెటిరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కరెంట్ బిల్లు అధికంగా వస్తే సమాచారం ఇవ్వండి

ట్రాన్స్‌కో జంగారెడ్డిగూడెం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కరెంట్ బిల్లులు అధికంగా వస్తే సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కి సమాచారం ఇవ్వాలని ఎపి ఇపిడిసిఎల్ జంగారెడ్డిగూడెం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని తాడువాయి సెక్షన్‌లో రెండు సర్వీసులకు అధికంగా బిల్లు వచ్చిందన్న ఫిర్యాదు ఆధారంగా ఆ రెండు కరెంటు సర్వీసు నెంబర్లను బిల్లింగ్ విభాగం ద్వారా తనిఖీ చేసినట్లు తెలిపారు. గత జులై 2022 నుంచి నవంబర్ 2022 వరకు ఉన్న బిల్లులను తనిఖీ చేయడం ద్వారా మీటర్లలో రీడింగు నమోదు కావడం వల్ల వారు కరెంటును వాడినట్లుగా తేలిందన్నారు. ఈ రెండు బిల్లులకు సంబంధించి డిపార్ట్‌మెంట్ తరపు నుంచి ఎటువంటి తప్పిదం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయన్ని సంబంధిత వినియోగదారులు పోసి బాబు, వెంకటేష్‌లకు తెలియజేసినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో కరెంట్ బిల్లులు అధికంగా వస్తే సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కి వెంటనే సమాచారం ఇవ్వాలని వినియోగదారులను ఆయన కోరారు.

నేడు దెందులూరులో ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి - దెందులూరు

భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులను అనుసరించి ఆదివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ నిర్వహించనున్నట్లు దెందులూరు తహశీల్దారు ఎన్‌వి.నాంచారయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 షెడ్యూల్‌లో భాగంగా స్పెషల్ క్యాంపైన్ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ బూత్‌లలో అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. దెందులూరు నియోజకవర్గం ఓటర్లు ఓటుకార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని నాంచారయ్య తెలిపారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం

ప్రజాశక్తి - టి.నరసాపురం

వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచంలా పని చేస్తుందని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు శనివారం పలుచోట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదమన్నారు. మీతో పాటు మీ తోటి వారికి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేయాలని చెప్పారు. హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

సత్యసాయి మంచినీటి పథకం సక్రమంగా నడిపించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సత్య సాయి మంచినీటి పథకం సక్రమంగా నడిపించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు డి.ప్రభాకర్ కోరారు. కొయ్యలగూడెంలో సత్యసాయి మంచినీటి పథక కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యసాయి మంచినీటి కార్మికులకు స్కిల్డ్ వేతనాలు సక్రమంగా అందించాలని జిఒ నెంబర్ 12 ప్రకారం జీతాలు అందించాలని కోరారు. అధికారులు తక్షణమే కార్మికుల సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర పరిపాలనలో జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తాడిగడప ఆంజనేయరాజు, సత్యసాయి మంచినీటి పథక ఎంవి ప్రసాద్, సెక్రటరీ సతీష్, మంచినీటి పథక కార్మికులు పాల్గొన్నారు.

నేడు కార్మిక సంఘాల సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈ నెల 11వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు చలసాని వెంకటరామారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పాల్గొంటున్నారని తెలిపారు. ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల ఏలూరు జిల్లాకు సంబంధించిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశం జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

జాతీయ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో 'విద్యావికాస్'కు బహుమతులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రామానుజ 33వ గణిత జాతీయ టాలెంట్ కాంపిటీషన్లో విద్యా వికాస్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారని విద్యాసంస్థల కరస్పాండెంట్ డైరెక్టర్లు పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో బహుమతి గెలుచుకున్న విద్యార్థినులు ఐ.చైతన్య, ఆర్.దివ్యాంశ్రీ శనివారం విద్యావికాస్ ప్రాంగణంలో అభినందించారు. ఈ సందర్భంగా పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పాఠశాల నాలుగో తరగతి విద్యార్థిని ఐ.చైతన్య, టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి, ఐదో తరగతి విద్యార్థిని ఆర్.దివ్యాంశ్రీ ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. విద్యాసంస్థల సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం దళితులకు రావాల్సిన నిధులు మంజూరు చేయాలని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో జైభీమ్ జైతెలుగుదేశం కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు ఆధ్వర్యంలో దళితవాడలోని మహిళలకు వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, బిసి సెల్ కార్యదర్శి చిట్టిబొమ్మ రామలింగేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు తరిపిరెడ్డి రామకృష్ణ, రాష్ట్ర మహిళా కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడం సౌభాగ్యవతి, పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు, ఎస్‌సి సెల్ పట్టణ అధ్యక్షులు యాడ్లపల్లి కొండ, ఘంటా రామారావు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దంపతులు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ సీతారామాంజనేయస్వామి ఆలయంలో మండలంలోని బూరుగుగూడెం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి హైమావతి దంపతులు శనివారం ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా చనుబండ గ్రామంలోని ప్రముఖ వర్తక వ్యాపార సంఘం అధ్యక్షులు నడిపల్లి కిషోర్ సంఘ సభ్యులతో కలిసి దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మిఠాయి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో చనుబండ గ్రామ సర్పంచి విస్సంపల్లి జ్యోతి, వైసిపి అధ్యక్షులు మోరంపూడి నాగేశ్వరరావు, జల్లేపల్లి పరమేశ్వరరావు, విసంపల్లి రామకృష్ణ, వనమా వాసు, కంచర్ల భాస్కరరావు, ఒంకిని వెంకటేశ్వరరావు, పొగడపోలు శివకుమార్, వైసిపి బిసి నాయకులు జోగు మహేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పాలచర్ల రాజవరం శివారులో కోడి పందెల శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులను, వారి వద్ద నుంచి రూ.970 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వణికిస్తున్న మాండూస్.. ఆందోళనలో రైతులు

ముసునూరులో ధాన్యం పట్టా కప్పుతున్న రైతులు

ప్రజాశక్తి - ముసునూరు

మాండూస్ తుపాన్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముసునూరు మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి పంట కొన్ని గ్రామాల్లో కోతకు వచ్చాయి. మరి కొన్ని గ్రామాల్లో కోత కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసి రక్షించుకునేందుకు పట్టాలు కప్పుతున్నారు. అమ్ముకునే సమయంలో ఇలా వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని పొలాల్లో కోత కోసి పొలంలోనే కట్టవేత దశలో ఉండటంతో మొలకలు వస్తాయేమోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణం మార్పుల్లో కొన్ని గ్రామాల్లో వరి కోత మిషన్ల ద్వారా కోత కొయ్యించిన ధాన్యాన్ని సొసైటీ కేంద్రాలు, రేవెన్యూ శాఖల ద్వారా రైస్ మిల్లులకు పంపించేందుకు సిద్ధం చేశారు. తేమ శాతం 5.5 శాతం ఉందని అధికారులు పైకి పంపించగా 4.5 శాతమే ఉందని తిరిగి మళ్లీ వెనక్కు పంపించారు. దీంతో ధాన్యాన్ని మళ్లీ ఎక్కడ ఆరబోయాలంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సచివాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

సలహాలు, సూచనలు అందించాలి

రాజబోయిన రాంబాబు, రైతు

భారీ వర్షాలు పడినప్పుడు నష్టం జరగకుండా రైతులకు రాయితీపై అందించాల్సిన టార్పిన్ పట్టాలు అందించడంలేదు. అది కాకుండా అడిగినా సరైన సమాధానం చెప్పడంలేదు. సచివాలయాల్లో ఉన్న సిబ్బంది ఇలాంటి విపత్కర పరిస్థితిలో కూడా సలహాలు, సూచనలు ఇవ్వడంలేదు.

నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి

పిల్లి పిచ్చియ్య, రైతు

కౌలు రైతులను వ్యవసాయ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.

భీమడోలు : తుపాను కారణంగా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమడోలు మండలానికి ధాన్యం కొనుగోలు లక్ష్యం 28 వేల మెట్రిక్ టన్నుల కాగా ఇప్పటివరకు ప్రభుత్వం 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మిగిలిన పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రవాణా సౌకర్యాలు లేక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఈ ధాన్యమంతటిని రైతులు రోడ్లపై ఆరబెట్టారు. కొన్నిచోట్ల బస్తాల్లో అక్కడికక్కడే భద్రపరిచారు. ధాన్యం కొనుగోలుకు అనుమతులు రాగానే అక్కడ నుంచే రవాణా చేసేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్నారు. కాని రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో ఆరబెట్టిన, బస్తాల్లో నింపిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు రైతుల వద్ద ప్లాస్టిక్ బరకాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం వ్యవసాయ సంస్థల ద్వారా రాయితీపై ప్లాస్టిక్ బరకాలు అందించే పథకాన్ని నిలిపివేసింది) వివిధ బస్తాలతో తయారుచేసిన బరకాలను అద్దెకు తెచ్చి వాటిని కప్పి ధాన్యాన్ని రక్షించే ప్రయత్నాలను చేస్తున్నారు. వర్షాలు నిరంతరంగా కురుస్తున్న నేపథ్యంలో ఆ బరకాలు పూర్తిస్థాయి రక్షణ ఇచ్చే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని తేమశాతంతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అవసరమైతే తేమ ప్రాతిపదికను ధరను నిర్ణయించి చెల్లించాలని, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

శుక్రవారం సాయంత్రం నుంచి వర్షాలు కురవటం, గాలులు వేయటంతో మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎం.నాగులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని భీమడోలు గ్రామంకు శుక్రవారం రాత్రి ఏడు గంటల నుంచి శనివారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో మధ్యమధ్యలో జరిగిన సరఫరాలో హైవోల్టేజ్ ఇబ్బందులు ఏర్పడటంతో పలు గృహాల్లో ఇన్వెర్టర్లు, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి.

చాట్రాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి : మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరాజు శనివారం పరిశీలించారు. జనార్దనవరంలో, ఆరుగొలనుపేట రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడుతూ ఆరబెట్టిన వరి ధాన్యాన్ని జాగ్రత్తగా తడవకుండా తగు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని అన్నదాతలు నష్టపోకుండా ఉండాలని చెప్పారు. ధాన్యం ఎగుమతులకు కావాల్సిన లారీలు, సంచులు పంపించాలని ఉన్నతాధికారులను కోరామని చెప్పారు. ఆయనతో పాటు వ్యవసాయ శాఖ అధికారి బి.శివశంకర్, రెవెన్యూ కార్యదర్శి ఉయ్యూరు ఆనందరావు పాల్గొన్నారు.

దెందులూరు : తుపాను ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని తహశీల్దార్ ఎన్.వి.నాంచారయ్య సూచించారు. మండలంలోని కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తుపాను ప్రభావం తగ్గేవరకూ కోతలు వాయిదా వేసుకోవాలని కోరారు.

బుట్టాయగూడెం : మండలంలోని ఇప్పలపాడు, జైనవారిగూడెం గ్రామాల్లో కోత కోసిన వరి చేలను తహశీల్దార్ ఎస్.ఎస్.శాంతి శనివారం పరిశీలించారు. తుపాన్ కారణంగా పంటకు ఎటువంటి నష్టం కాకుండా ఉండటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమయంలో రైతులకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దెందులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

చింతలపూడి : కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం అన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులు నష్టపోతారన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ టౌన్ అధ్యక్షులు కర్లపూడి రాజారత్నం, నాయకులు మారుమూడి థామస్, షేక్ రబ్బాని, గన్నమనేని శ్రీనివాసరావు, మద్దా ఆనంద్, షబ్బీర్, వనమాల శ్రీను పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

వృద్ధుల హక్కులను కాపాడాలి

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక పవర్ పేటలోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో శనివారం మానవ హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాయ్‌చమక్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకు పవర్‌పేటలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో టీ, బన్, ఆపిల్, ఆరెంజ్ ఫ్రూట్స్ పలు పౌష్టికాహారాలు వృద్ధులకు 30 రోజుల పాటు అందించనున్నారు. ఈ సందర్భంగా బాల వికాస్ భారతి ఫౌండర్ ప్రెసిడెంట్ ఎస్ఎన్.కట్టా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వృద్ధాప్యంలో ఉన్నవారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కన్న బిడ్డలే వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వృద్ధులపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల నుంచి వారికి రక్షణ కల్పించాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి జి.రాజేశ్వరి మాట్లాడుతూ వృద్ధుల కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. పిల్లల చేత నిర్లక్ష్యానికి గురైతే వారు స్వయంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారిని సంప్రదించవచ్చని చెప్పారు. వాటిని అమలు పరచాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఆమె తెలిపారు. ముఖ్యవక్తగా హాజరైన మానవతా సంస్థ విద్యానిధి, చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి సమాజ నిర్మాణంలో వృద్ధుల పాత్ర అమోఘమని, వారి పట్ల సమాజం మొత్తం గౌరవం కలిగి ఉండాలని, బాల వికాస్ భారతి సంస్థ చేపట్టిన చాయ్ చమక్ పౌష్టికాహార కార్యక్రమం వృద్ధులు బాగా ఉపయోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం చాయ్, బన్, ఆపిల్, ఆరెంజ్ ఫ్రూట్స్ అందించారు. బాల వికాస్ భారతి, జాయింట్ సెక్రటరీ బొంతు పెదబాబు సభకు హాజరైన అతిథులకు, వృద్ధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవ కమిటీ కోశాధికారి విజిఎం.కృష్ణారావు, గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, లయన్స్ క్లబ్ ఏలూరు జోన్ చైర్‌పర్సన్ వుడతా రత్నకుమార్, మానవత సంస్థ కార్యదర్శి ఎం.అజయ్‌బాబు, వాల్ ఆఫ్ కైండ్ నెస్ ఫౌండర్, ఆర్గనైజర్ పొనుగుపాటి వెంకటరమణ, సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు పాల్గొన్నారు.

గణపవరంలో...

గణపవరం :ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ ప్రతిఒక్కరికి స్వేచ్ఛ, హోదా, న్యాయం, మానవ హక్కులని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, టి.అక్కిరాజు, స్వరూపరాణి, ఎన్‌విఎస్.శ్రీనివాసు, సిహెచ్ అనురాధ, జివి.శారదాదేవి పాల్గొన్నారు.

కెఆర్ పురంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కెఆర్‌పురంలో శనివారం టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీల వద్దకు వెళ్లి వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ప్రజలకు అండగా తెలుగుదేశం పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సున్నం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం కన్నపరాజు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, జల్లికాకినాడ గ్రామ కాపురస్తులయిన అనిపే వేదకుమారి, తండ్రి: చిన్న లక్ష్మణరావు అను నేను నాయొక్క పాస్‌పోర్ట్ జల్లికాకినాడ నుండి గణపవరం ఆటోలో వస్తూ ఉండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. పాస్‌పోర్ట్ ఉన్న కవరు పోయినది. నాయొక్క పాస్‌పోర్ట్ నెం. **P0637835.** కావున పాస్‌పోర్ట్ దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

అనిపే వేదకుమారి, D/o. చిన్న లక్ష్మణరావు
జల్లికాకినాడ గ్రామం, గణపవరం మండలం
ఏలూరు జిల్లా, సెల్: 97053 28655

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న ఇళ్ల కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కమిషనర్ షేక్ షాహిద్ పేర్కొన్నారు. స్థానిక సత్రంపాడులోని ఎంఆర్‌సి కాలనీలో గృహ నిర్మాణ పనులను శనివారం సంబంధిత అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీలో మొత్తం 26 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. సహాయ సంఘాల గ్రూపుల ద్వారా లబ్ధిదారులకు ముందుగానే రూ.35 వేలు ఇంటి నిర్మాణానికి అందిస్తున్నామన్నారు. కాలనీలో ఇప్పటికే విద్యుత్, వీధిలైట్లు, నీటి సదుపాయం కల్పించామన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు వేగవంతం చేసి మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు ప్రకారం ప్రతి శనివారం గృహ నిర్మాణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గృహ నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు కమిషనర్ షాహిద్ తెలిపారు. అనంతరం తహశీల్దార్ సోమశేఖర్‌తో కలిసి కమిషనర్ ఇళ్ల నిర్మాణ ప్రగతిపనులపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : తణుకు

O.S.No. 442/2020

Between:
Vijaya Bank, Now Bank of Baroda
...Plaintiff
AND
Tholeti Peda Narasimha Rao
Tholeti Mangatayaru
Vemula Aswani Kumar
...Defendants

ప్రకటన

పై నెంబరు గ్రంధములో మీ ముగ్గురికి ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసియున్నారు. పైనెంబరు గ్రంధము **ది.15-12-2022వ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున సదరు తేదీన మీరు ముగ్గురూ ప్రత్యక్షంగా కాని, పరోక్షమంగా కాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10:00 గంటలకి హాజరు కావల్సినదిగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, **ఓ.ఎన్.కృష్ణ**
03-12-22. అడ్వకేట్, తణుకు.

నేడు వైద్య ఉద్యోగుల ఆత్మగౌరవ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగే వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సర్వజన మహాసభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తరలివస్తున్నారని సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జివివి.ప్రసాద్ శనివారం తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతున్న సర్వజన మహాసభను రాష్ట్రంలోని వైద్య ఉద్యోగులు తమ ఆత్మగౌరవ సభగానే పరిగణిస్తూ ప్రతిష్టాత్మకంగా భావించి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కోల్పోతున్న పూర్వ వైభవాన్ని తిరిగి రప్పించడానికి సంఘం అధ్యక్షులు జి.ఆస్కార్ రావు నేతత్వంలో చేపట్టిన మహాయజ్ఞమే సర్వజన మహాసభగా ఆయన వివరించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు ఆల్ ఇండియా నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు గొంగళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ కమర్షియల్ టాక్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ గౌరవ అతిథిగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ వి.రామిరెడ్డి విశిష్ట అతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఆస్కార్ రావు అధ్యక్షత వహిస్తారని, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.రమణ సారథ్యంలో కార్యక్రమం జరుగుతుందని ప్రసాద్ తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ **శ్రీమతి ఆకుల గంగాదేవి** (సెల్: 7674088811) భర్త: ఆకుల అజయ్‌కుమార్, నార్ని వీరేశలింగం వీధి, గాంధీనగర్, ఏలూరు, ఏలూరు జిల్లా వారి యొక్క సంజాయిషీ ప్రకారం యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,

ప్రస్తుత ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వడ్డిగూడెం గ్రామానికి చెందిన లేటు శ్రీ ఘంటసాల రాజు గారి భార్య శ్రీమతి ఘంటసాల వెంకాయమ్మ మరియు వారి కుమారుడు ఘంటసాల వెంకటరావు అను వార్లకు వారి పూర్వార్జితపు ఆస్తిగా వున్నటువంటి షెడ్యూల్ ఆస్తిని, నా క్లయింట్ సదరు ఆస్తిని క్రయ రిజిస్టర్ చేయించుకొనుటకు గాను క్రయ అగ్రిమెంటు వ్రాయించుకుని ఉన్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికన్నా ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల ఈ నోటీస్ ప్రకటించిన తేదీ నుండి 7 రోజుల లోపల తెలియజేయవలెను. లేనియెడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించబడుతుంది.

__*షెడ్యూల్ ఆస్తి వివరము:*__ ఏలూరు జిల్లా, పాత పశ్చిమగోదావరి జిల్లా, వట్లూరు సబుడి, పెదపాడు మండలం, వడ్డిగూడెం పంచాయతీ, కొణికి గ్రామంలోని సర్వే నెంబర్ 381/1A లో గల య. 0.76 ట్ల చెరువు భూమికి గల హద్దులు:

తూర్పు: ముంగర విష్ణు యొక్క భూమి. **దక్షిణం:** ఆకుల గంగాదేవి యొక్క భూమి. **పడమర:** కొండయ్య కోడు అనే కాలువ. **ఉత్తరం:** ఘంటసాల బాలరాజు భూమి.

ఎన్.వి.సత్యనారాయణ, అడ్వకేట్
ఏలూరు పడమర వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా
10-12-2022 సెల్: 9440376655

యాత్రికులకు ఇబ్బందిలేకుండా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి ఉత్సవాల సందర్భంగా సింగరాయపాలెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దిగ్విజయంగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచి బోయిన విమల అన్నారు. షష్టి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ సచివాలయ కార్యదర్శి లక్ష్మీసరస్వతి, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో ఉత్సవాలు జరిగిన 13 రోజుల పాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రతిరోజు నిరంతరం శానిటేషన్ చేయించినట్లు చెప్పారు. ప్రతిరోజు గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేయించినట్లు తెలిపారు. దూరప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగుకుండా గ్రామ పంచాయతీ తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీసరస్వతీ గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. గ్రామ ఉపసర్పంచి జి.సుగుణ, వార్డు సభ్యులు బోయిన రామరాజు, కె.దుర్గా, ఎం.రమ్య, సిహెచ్.నాగబాబు, ఎస్.సీతామహాలక్ష్మి, కె.భవాని, డి.సురేష్ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేయించినట్లు సర్పంచి విమల తెలిపారు.



సింగరాయపాలెంలో రోడ్లపై చెత్త తొలగిస్తున్న కార్మికులు

సింగరాయపాలెంలో ముగిసిన షష్టి ఉత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో సింగరాయపాలెంలో గత 13 రోజులుగా జరుగుతున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి కళ్యాణ మహోత్సవాలు శనివారం నిర్వహించిన అఖండ అన్నసమారాధనతో వైభవంగా ముగిశాయి. గత నెల28న స్వామివారిని పెండ్లికుమారుని చేయడంతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు శనివారం నిర్వహించిన అఖండ అన్నసమారాధనతో ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ షష్టి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించిన ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. తొలుత డిఎన్ఆర్ దంపతులకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

అఖండ అన్నసమారాదన

అఖండ అన్నసమారాధనకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం పది గంటలకే సమారాధన ప్రారంభం కావడంతో వేలాదిగా యాత్రికులు తరలివచ్చి స్వామివారి అన్నసమారాధనలో పాల్గొన్నారు. 50 వేల మంది భక్తులు సమారాధనలో పాల్గొన్నట్లు చైర్మన్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ షణ్ముఖసాయి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, వైసిపి మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు